TGTEL/26/A2635

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 74 | 27-07-2026 సోమవారం | పేజీలు: 08 | వెల: 3/-

## మూడో టీ20 కూడా మనదే... జింబాబ్వేపై టీమిండియా క్లీన్ స్వీప్







# ఓటు హక్కు 18 ఏళ్లు..
# పోటీకి 25 ఎందుకు?

**శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వయోపరిమితి 21కి తగ్గించాలని రేవంత్ డిమాండ్**

**21 ఏళ్లకే ఐఏఎస్, మేయర్లు అవుతున్నప్పుడు ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదని ప్రశ్న**

**ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్న సీఎం**

**గుజరాత్‌లాగే తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్, (డిడి9 వార్త):** యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఐఏఎన్‌ఎస్ వార్తా సంస్థకు మిగతా 2లో..



## కార్గిల్ యుద్ధ వీరుల ధైర్యమే దేశానికి స్ఫూర్తి

**కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర వీరులకు ప్రధాని నివాళి**

**జూలై 26 ప్రతి భారతీయుడు గుర్తుంచుకునే చారిత్రాత్మక రోజు: మోదీ**

**కార్గిల్ వీరుల ధైర్యసాహసాలు దేశానికి శాశ్వత స్ఫూర్తి**

**మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల సేవలు మరువలేనివి**

**'మన్ కీ బాత్'లో కార్గిల్ యుద్ధ వీరుల సేవలను కొనియాడిన ప్రధాని**

**'శౌర్య విజయ్ యాత్ర' దేశభక్తిని మరింత బలోపేతం చేస్తోంది**

**'ఒక రైడ్ – ఒక దేశం – ఒక సెల్యూట్' నినాదాన్ని ప్రస్తావించిన మోదీ**

**నేషనల్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వరకు ప్రత్యేక యాత్ర**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** జీవితంలో కొన్ని తేదీలను గుర్తుంచుకోవడానికి క్యాలెండర్ చూడాల్సిన అవసరం ఉండదని, జూలై 26 అలాంటి చారిత్రాత్మకమైన తేదీల్లో ఒకటని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన 136వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర వీరులకు ఘన నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు చూపిన అసాధారణ ధైర్య సాహసాలు మిగతా 2లో..

## విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత నియామకం**

**రాష్ట్రపతి ఉత్తర్వులతో అదనపు బాధ్యతలు**

**ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన జోషి**

**జాతీయ విద్యా విధానాన్ని కొనసాగిస్తానన్న హామీ**

**ఇప్పటికే రెండు కీలక శాఖల బాధ్యతల నిర్వహణ**




## రాపిడో డ్రైవర్‌గా మారిన తీన్మార్ మల్లన్న

**రైడర్ల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు బైక్‌పై పర్యటన**

**ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను మండలిలో లేవనెత్తుతా: మల్లన్న**

**ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం**

**హెల్మెట్ ధరించి రోడ్లపైకి దిగిన ఎమ్మెల్సీ**

02




## విద్యార్థులపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగిస్తారా?

**అమిత్ షాకు రాహుల్ ఘాటు లేఖ**

**విద్యార్థులపై బలప్రయోగాన్ని ఖండించిన రాహుల్**

**పెల్లెట్ గన్‌ల వినియోగంపై వివరణ కోరిన ప్రతిపక్ష నేత**

**గాయపడిన విద్యార్థి పరిస్థితిపై ఆందోళన**

**లాఠీఛార్జ్‌కు బాధ్యులెవరో చెప్పాలని డిమాండ్**


**శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు అన్న రాహుల్**

**పార్లమెంట్ సమావేశాలకు ముందు రాజకీయ ప్రాధాన్యం**



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):** ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జరిగిన బలప్రయోగం వ్యవహారంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటు మిగతా 2లో..

## బీజేపి అధ్యక్షునివి నీతిమాలిన రాజకీయాలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విషయంలో నాడు టిఆర్ ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయకుండా నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలనడం బీజేపి అధ్యక్షుడు రామచందరరావు నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మిగతా 2లో..

**రామచందర్ రావుపై మంత్రి పొన్నం ఫైర్**

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ రాజకీయాలు చేస్తోంది: మంత్రి పొన్నం**

**బీఆర్ఎస్ హయాంలో పేరుకుపోయిన బకాయిలపై బీజేపీ ఎందుకు మౌనం?**

**దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి: కేంద్రానికి డిమాండ్**

**డైవర్షన్ పాలిటిక్స్ కోసమే బీజేపీ డ్రామాలు**

**ఎమ్మెల్యే, ఎంపీ పోటీ వయస్సును 21 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదనపై బీజేపీ వైఖరి చెప్పాలి**

**విద్యార్థి సంఘాల ఎన్నికలకు కాంగ్రెస్ పూర్తి మద్దతు**

**పరీక్ష పేపర్ లీకేజీలపై బీజేపీకి మాట్లాడే నైతిక హక్కు లేదు**

**విద్యార్థుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నిధులు ఇవ్వాలి**



## ఇందిరమ్మ ఇళ్ల పేరిట సైబర్ మోసాలు

**నకిలీ కాల్స్, లింకులపై సీపీ హెచ్చరిక**

**ఈఎండీ పేరుతో డబ్బులు అడిగితే నమ్మొద్దు**

**అపరిచిత ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు**

**యూపీఐ పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు**

**ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకమన్న సీపీ**

02

## జెన్‌జీకి మంత్రి పదవులు ఇవ్వండి

**రేవంత్‌కు బండి సంజయ్ సవాల్**

**యువతకు మంత్రి పదవుల డిమాండ్**

**ఖాళీ శాఖలు జెన్-జీకి ఇవ్వాలన్న సూచన**

**కాంగ్రెస్‌పై బీజేపీ నేత విమర్శలు**






## అస్సాంలో వరద బీభత్సం

**66కు చేరిన మృతుల సంఖ్య**

**ఇంకా 6.54 లక్షల మంది వరద ప్రభావంలోనే**

**పలు జిల్లాల్లో కొనసాగుతున్న తీవ్ర పరిస్థితి**

**శిబిరాల్లో వేలాది మంది బాధితులు**

**బ్రహ్మపుత్ర ఉద్ధృతితో భారీ నష్టం**

**సహాయక చర్యలు ముమ్మరం చేసిన ప్రభుత్వం**

**అస్సాం, (డిడి9 వార్త):** ఇటీవలి భారీ వర్షాలతో అతలాకుతలమైన అస్సాంలో వరదల ఉద్ధృతి కొంత తగ్గినా పరిస్థితి ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదు. రాష్ట్రంలో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 66కు చేరగా, ఇంకా 6.54 లక్షల మందికి పైగా ప్రజలు వరద ప్రభావంలోనే ఉన్నట్లు అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏఎస్‌డీఎంఏ) వెల్లడించింది. పలు ప్రాంతాల్లో వరద నీరు తగ్గుతున్నప్పటికీ, అనేక గ్రామాలు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం శివసాగర్, చరైదేవ్, జోర్హాట్, దిబ్రుగఢ్, గోలాఘాట్, మిగతా 2లో..

## ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారత జెన్–జీ

**సీజేపీ ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతు**

**పొరుగు దేశాల్లోనూ ప్రశంసల వెల్లువ**

**మీమ్స్‌తో మొదలై ఉద్యమంగా మారిన పోరాటం**

**విద్యాశాఖ మంత్రి రాజీనామాతో మరింత చర్చ**

**శ్రీలంక, నేపాల్, పాకిస్థాన్ యువత ప్రశంసలు**

**భారత యువత ఐక్యతపై విదేశీ వ్యాఖ్యలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):** నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా సాగిన 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' ఉద్యమం భారత సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. జెన్-జీపై ఉన్న "ఏకాగ్రత తక్కువ,



# కార్గిల్ యుద్ధ వీరుల ధైర్యమే దేశానికి స్ఫూర్తి

మొదటిపేజీ తరువాయి

ప్రతి భారతీయుడికి శాశ్వత స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. మాతృభూమి రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల సేవలను దేశం ఎన్నటికీ మరువదని పేర్కొన్న ప్రధాని, ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ నుంచి కార్గిల్ వార్ మెమోరియల్ వరకు నిర్వహిస్తున్న "శౌర్య విజయ్ యాత్ర"ను ప్రస్తావించారు. "ఒక రైడ్ - ఒక దేశం - ఒక సెల్యూట్" అనే నినాదంతో సాగుతున్న ఈ యాత్ర దేశభక్తిని మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు.

**రక్షణ రంగంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు**

భారత్ రక్షణ రంగంలో స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. ఇటీవల భారత నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపుదిద్దుకున్న అత్యాధునిక యుద్ధనౌక అని తెలిపారు. ఇందులో 75 శాతానికి పైగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ఆత్మనిర్భర్ భారత్ విజయానికి నిదర్శనమని చెప్పారు.ఇటీవల డీఆర్‌డీవో విజయవంతంగా పినాకా లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ పరీక్షలు నిర్వహించిందని, అలాగే కుషా క్షిపణి వ్యవస్థ పరీక్ష కూడా విజయవంతమైందని గుర్తు చేశారు. రక్షణ రంగంలో భారత్ సాధిస్తున్న సాంకేతిక పురోగతి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందని, భారత రక్షణ ఉత్పత్తులపై అంతర్జాతీయ విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు.బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతుల కోసం ఇండోనేషియాతో కుదిరిన ఒప్పందం భారత్‌పై ప్రపంచం పెంచుకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత రక్షణ పరికరాలు ఇప్పుడు ప్రపంచ మార్కెట్‌లో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలుస్తున్నాయని చెప్పారు.

**విక్రమ్–1తో అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయం**

భారత అంతరిక్ష రంగం మరో చారిత్రాత్మక ఘట్టాన్ని చేరుకుందని ప్రధాని తెలిపారు. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగం దేశంలోని ప్రతి పౌరుడిని గర్వపడేలా చేసిందన్నారు. ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ విజయవంతం కావడం ద్వారా భారత యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు ప్రపంచానికి తమ ప్రతిభను చాటారని కొనియాడారు. ప్రభుత్వ విధానాలు, యువత ఆవిష్కరణలు కలిసివస్తే భారత్ అంతరిక్ష రంగంలో అగ్రగామిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**క్రీడల్లో యువత సత్తా: తెలుగు తేజం పివి సింధు దేశానికి గర్వకారణం**

భారత యువత క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో విజయాలు సాధిస్తోందని ప్రధాని అన్నారు. ఇటీవల జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయ క్రీడాకారిణిగా తెలుగు తేజం పీ.వి. సింధు నిలవడం దేశానికి గర్వకారణమన్నారు. అలాగే లార్డ్స్ వేదికగా భారత మహిళల క్రికెట్ జట్టు తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేయడం భారత మహిళా క్రీడల ఎదుగుదలకు ప్రతీక అని అభినందించారు.

**స్వావలంబనే వికసిత భారత్‌కు పునాది**

భారత్ ప్రస్తుతం రక్షణ, అంతరిక్షం, సాంకేతికత, స్టార్టప్‌లు, తయారీ రంగాల్లో ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి చేరుకుంటోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యువతలో ఆవిష్కరణ స్ఫూర్తి, శాస్త్రవేత్తల కృషి, సైనికుల త్యాగం, ప్రజల భాగస్వామ్యంతో "వికసిత భారత్-2047" లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**పర్యావరణం – ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం**

దేశవ్యాప్తంగా జరుగుతున్న వృక్షారోపణ కార్యక్రమాలు, నీటి సంరక్షణ ఉద్యమాలు, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు సురక్షితమైన భారత్‌ను అందించగలమని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని ప్రధాని నరేంద్రమోడి అభిలంషించారు.

దేశాభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి పౌరుడు తన రంగంలో అత్యుత్తమంగా పనిచేస్తేనే భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని ప్రధాని అన్నారు. "మనం కలిసి ముందుకు సాగితే అసాధ్యం అనేది ఉండదు. ప్రతి భారతీయుడి సంకల్పమే వికసిత భారత నిర్మాణానికి అసలైన శక్తి" అని మన్ కీ బాత్ సందేశాన్ని ముగించారు.

# జెన్‌జీకి మంత్రి పదవులు ఇవ్వండి

- **రేవంత్‌కు బండి సంజయ్ సవాల్**
- **యువతకు మంత్రి పదవుల డిమాండ్**
- **ఖాళీ శాఖలు జెన్-జీకి ఇవ్వాలన్న సూచన**
- **కాంగ్రెస్‌పై బీజేపీ నేత విమర్శలు**


**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శంషాబాద్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ సంచలన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మాటలు చెప్పడం కాదని, చిత్తశుద్ధి ఉంటే 21 నుండి 30 ఏళ్ల వయస్సున్న 'జెన్‌జీ' (GenZ) యువతకు మంత్రి పదవులు ఇచ్చి ఆచరణలో చూపించాలని డిమాండ్ చేశారు. సీఎం వద్ద ఖాళీగా ఉన్న హోమ్, విద్యా, మున్సిపల్ వంటి కీలక శాఖలను యువతకే అప్పగించాలని వ్యాఖ్యానించారు. అవసరమైతే ప్రస్తుతం ఉన్న కొందరు ఎమ్మెల్సీలతో రాజీనామా చేయించి, ఆ పదవులను జెన్‌జీ యువతకు ఇవ్వాలని, కాంగ్రెస్ దృష్టిలో జెన్‌జీ లంటే విహెచ్, కేకే, కోదండరెడ్డి అనుకుంటున్నారా అంటూ సంజయ్ ఎద్దేవా చేశారు.

వయోభారంతో ఉన్న పెద్దలకు యూత్ కోటాలో పదవులు కట్టబెట్టడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని బండి సంజయ్ ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ సంస్కృతికి భిన్నంగా భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ "దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, పర్సన్ లాస్ట్" అనే సిద్ధాంతానికే కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ సిద్ధాంతంలో భాగమే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని గుర్తుచేశారు. యువతకు ప్రాధాన్యత ఇస్తున్నామని మాటలతో మోసం చేయకుండా, నిజంగా యువ శక్తిపై నమ్మకం ఉంటే రాష్ట్ర పాలనలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రేవంత్ రెడ్డి సర్కారును సంజయ్ డిమాండ్ చేశారు.

# అస్సాంలో వరద బీభత్సం

మొదటిపేజీ తరువాయి



నాగావ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. వీటిలో శివసాగర్ జిల్లాలో సుమారు 2.9 లక్షల మంది, చరైదేవోలో 1.9 లక్షల మంది, జోర్హాట్‌లో 1.3 లక్షల మందికి పైగా వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా కొన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గినా, సహజ పరిస్థితులు పూర్తిగా పునరుద్ధరించబడలేదు.

వరదలతో నిరాశ్రయులైన వేలాది మంది ఇప్పటికీ ప్రభుత్వ సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర నిత్యావసరాలను అధికారులు అందిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రభుత్వం తెలిపింది.

బ్రహ్మపుత్ర నదితో పాటు పలు ప్రధాన నదులు ఉప్పొంగడంతో రహదారులు, వంతెనలు, వ్యవసాయ భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేల ఎకరాల్లో పంటలు నీట మునగగా, అనేక కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయాయి. పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, అవసరమైన సహాయ సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

# ఓటు హక్కు 18 ఏళ్లు.. పోటీకి 25 ఎందుకు?

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్‌జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు.

ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. "ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే కనీస వయసు 25 సంవత్సరాలు. అదే, రాజ్యసభ సభ్యుడిగా, శాసనమండలి సభ్యుడిగా పోటీ చేయాలంటే కనీస వయసు 30 సంవత్సరాలు ఉండాలి.

# బీజేపి అధ్యక్షునివి నీతిమాలిన రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

ఎందుకు ప్రశ్నించలేదో సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడినవి కావని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య ఇది అన్నారు. నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తుందో స్పష్టం చేయాలన్నారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కనీసం రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్రం కూడా తన వంతు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డైవర్షన్ కోసమే ఈ నాటకాలు ఆడుతున్నారని మంత్రి అన్నారు. దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలన్న ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ అంశంపై సమాధానం చెప్పకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? ఈ విషయాన్ని రామచంద్రరావు స్పష్టంగా చెప్పాలన్నారు.

**విద్యార్థి సంఘాల ఎన్నికలపై మీ అభిప్రాయం ఏంటో చెప్పండి:**

విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలన్నది కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన అభిప్రాయం అని ఈ విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో కూడా వెల్లడించాలన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలకు బీజేపీ మద్దతు ఇస్తుందా? లేదా వ్యతిరేకిస్తుందా? అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలి. పరీక్ష పేపర్ల లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న బీజేపీకి, విద్యార్థుల గురించి ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరిట సైబర్ మోసాలు

- **నకిలీ కాల్స్, లింకులపై సీపీ హెచ్చరిక**
- **ఈఎండీ పేరుతో డబ్బులు అడిగితే నమ్మొద్దు**
- **అపరిచిత ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు**
- **యూపీఐ పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు**
- **ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకమన్న సీపీ**
- **మోసపోతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. రూ.10,000 ఈఎండీ చెల్లిస్తే ఇల్లు కేటాయిస్తామని చెప్పే నకిలీ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. "ఈ రోజే చివరి తేదీ" అంటూ భయపెట్టి డబ్బులు కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని కోరారు.

వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయరాదని సీపీ స్పష్టం చేశారు. అలాగే AnyDesk, TeamViewer వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇతరుల సూచన మేరకు ఇన్‌స్టాల్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. యూపీఐ పిన్, ఓటీపీ, ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం వంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో దళారులు లేదా మధ్యవర్తులకు ఎలాంటి అవకాశం లేదని సజ్జనార్ తెలిపారు. దరఖాస్తుదారుడికి ఇల్లు కేటాయించని పక్షంలో చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని ప్రభుత్వమే నేరుగా సంబంధిత బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేసి న్యాయం పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాపిడో డ్రైవర్‌గా మారిన తీన్మార్ మల్లన్న

- **రైడర్ల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు బైక్‌పై పర్యటన**
- **అధిక కమిషన్లు, ఆదాయ లోటుపై ప్రత్యక్షంగా అధ్యయనం**
- **ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను మండలిలో లేవనెత్తుతా: మల్లన్న**
- **ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం**
- **హెల్మెట్ ధరించి రోడ్లపైకి దిగిన ఎమ్మెల్సీ**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన మల్లన్న రాపిడో రైడ్ వీడియో**
- **డ్రైవర్ల హక్కుల కోసం వినూత్న కార్యక్రమంతో ముందుకొచ్చిన టీఆర్‌పీ చీఫ్**
- **గ్రౌండ్ లెవల్‌లో సమస్యలు తెలుసుకునే ప్రయత్నానికి ప్రశంసలు**
- **రాపిడో–ఆటో వివాదం మధ్య మల్లన్న ప్రత్యేక చొరవ**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ ఏది చేసిన జనబాహుళ్యంలోకి వెళ్ళే విధంగా వినూత్న రీతిలో కార్రా్యకమం చేస్తారనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇటీవల ర్యాపిడో, ఆటోల మధ్య వివాదం తెలెత్తుతోన్న విషయం విధితమే.కాగా, హైదరాబాద్ నగరంలో రాపిడో బైక్ టాక్సీలు నడుపుతూ జీవనం సాగిస్తున్న రైడర్ల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకునేందుకు శనివారం సాయంత్రం మల్లన్న రోడ్డెక్కారు. స్వయంగా బైక్ నడుపుతూ రాపిడో డ్రైవర్‌గా మారారు. రాష్ట్రంలో రాపిడో డ్రైవర్లు ఎదుర్కొంటున్న అధిక కమిషన్ చార్జీలు, యాప్ కంపెనీల విధానాలు, ఆదాయ లోటు, రోజువారీ ఉపాధి సమస్యలను ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకునేందుకు ఆయన రాపిడో బైక్ నడిపినట్లుగా టీఆర్‌పీ వర్గాలు తెలిపారు. ఆన్‌లైన్ ట్యాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఈ సమస్యలన్నింటినీ రాబోయే శాసన మండలి సమావేశాల్లో బలంగా ప్రస్తావించి, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ పొందేలా పోరాడతానని ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న వెల్లడించారు. అయితే, సోషల్ మీడియాలో నిత్యం వార్తలు చదువుతూ కనిపించే తీన్మార్ మల్లన్న హెల్మెట్ పెట్టుకుని, బైక్ నడుపుతూ కనిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. డ్రైవర్ల హక్కుల కోసం ఆయన తీసుకున్న ప్రత్యేక చొరవపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# విద్యార్థులపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగిస్తారా?

మొదటిపేజీ తరువాయి

లేఖ రాశారు. జూలై 20న శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగించడం తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో పెల్లెట్ గన్‌ల వినియోగం అత్యంత దిగ్భ్రాంతికరమని లేఖలో విమర్శించారు.

పెల్లెట్ దాడిలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ తీవ్రంగా గాయపడ్డాడని, అతడు కంటి చూపు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాడని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శాంతియుత నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఇంతటి బలప్రయోగం ఎందుకు జరిగిందో దేశానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై బలప్రయోగానికి, పెల్లెట్ గన్‌ల వినియోగానికి అనుమతి ఎవరు ఇచ్చారో వెల్లడించాలని రాహుల్ లేఖలో ప్రశ్నించారు. లాఠీలతో విద్యార్థులపై దాడి చేసిన సివిల్ డ్రస్‌లోని వ్యక్తులు పోలీసులు లేదా ఇతర వాలంటీర్లా అనే విషయాన్ని కూడా స్పష్టం చేయాలని కేంద్ర హోం మంత్రిని కోరారు.

ఈ ఘటనలో యువతులు సహా వందలాది మంది గాయపడ్డారని రాహుల్ గాంధీ ఆరోపించారు. శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు అని, నిరసనకారుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బలప్రయోగానికి బదులుగా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించారు.

విద్యార్థులపై పోలీసులు బలప్రయోగానికి దిగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. రేపటి నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన లేఖ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారత జెన్–జీ

మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియాకే పరిమితం" అనే అభిప్రాయాలను తలకిందులు చేస్తూ యువత నెల రోజులపాటు సాగించిన నిరసనలు కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురి చేశాయని, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిన నేపథ్యంలో ఈ ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని అంతర్జాతీయ మీడియా విశ్లేషించింది. సాంప్రదాయ రాజకీయ ప్రచారానికి భిన్నంగా మీమ్స్, రీల్స్, షార్ట్ వీడియోలనే ప్రధాన ఆయుధాలుగా ఉపయోగించడం ఈ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. నిరసనల నిర్వహణ, పోలీసు చర్యల దృశ్యాలు, సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ కావడంతో ఉద్యమానికి దేశవ్యాప్తంగా, విదేశాల్లోనూ విస్తృత మద్దతు లభించిందని పేర్కొంది.

2022లో ఆర్థిక సంక్షోభంపై భారీ యువజన ఉద్యమాన్ని చూసిన శ్రీలంకలో భారత విద్యార్థుల పోరాటానికి విశేష స్పందన లభించింది. శ్రీలంక కార్టూనిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు భారత యువత ధైర్యాన్ని ప్రశంసిస్తూ పోస్టులు చేశారు. యువత ప్రారంభించిన ఉద్యమాలు ఆసియాలో మార్పుకు నాంది పలుకుతున్నాయని, భారత యువత అదే స్ఫూర్తిని కొనసాగిస్తోందని వ్యాఖ్యానించారు. నేపాల్‌కు చెందిన పలువురు కంటెంట్ క్రియేటర్లు, యువజన నాయకులు కూడా భారత విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. నిరసనకారుల ఆవేదనను అతిగా భావించకూడదని, ఉద్యమం ప్రారంభించిన లక్ష్యాన్ని చివరి వరకు గుర్తుంచుకోవాలని సూచించారు. ఉద్యమంలో ఐక్యత, పట్టుదలే విజయానికి కీలకమని పేర్కొన్నారు. అత్యంత ఆసక్తికరంగా పాకిస్థాన్ యువత నుంచి కూడా భారత జెన్-జీకి ప్రశంసలు వెల్లువెత్తాయి. మత, కుల, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఒక్కటిగా పోరాడిన తీరును పలువురు కొనియాడారు. అవకాశం వస్తే తాము అలాంటి ఉద్యమంలో పాల్గొనేవారమని కొందరు వ్యాఖ్యానించగా, భారత యువత ధైర్యం తమకు స్ఫూర్తినిస్తోందని మరికొందరు చెప్పారు. పాకిస్థాన్‌లో విద్యార్థి ఉద్యమాలకు ఉన్న పరిమితులను ప్రస్తావిస్తూ, భారత యువతకు లభిస్తున్న ప్రజాస్వామ్య అవకాశాలను ప్రశంసించారు.

సీజేపీ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థుల ఐక్యతపై పాకిస్థాన్‌లోని కొన్ని పత్రికలు, విశ్లేషకులు కూడా ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. భారత జెన్-జీ ప్రదర్శించిన సంఘటిత పోరాటం ఆసియా యువతకు కొత్త సందేశంగా మారిందని, సామాజిక మాధ్యమాల శక్తిని ప్రజాస్వామ్య ఉద్యమాల్లో సమర్థంగా వినియోగించిన ఉదాహరణగా ఈ నిరసనలను అభివర్ణించాయి.

# విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

- **ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత నియామకం**
- **రాష్ట్రపతి ఉత్తర్వులతో అదనపు బాధ్యతలు**
- **ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన జోషి**
- **జాతీయ విద్యా విధానాన్ని కొనసాగిస్తానన్న హామీ**
- **ఇప్పటికే రెండు కీలక శాఖల బాధ్యతల నిర్వహణ**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కేంద్ర విద్యాశాఖ అదనపు బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం అధికారికంగా స్వీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ఈ మేరకు శనివారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ కాగా, ఆదివారం ఆయన విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే వినియోగదారుల వ్యవహారాలు, ఆహార-ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహిస్తున్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను అదనపు బాధ్యతగా కేటాయించారు.

విద్యాశాఖ బాధ్యతలు అప్పగించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రహ్లాద్ జోషి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యారంగంలో కీలక సంస్కరణలు చేపట్టారని, ముఖ్యంగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడంలో విశేష కృషి చేశారని ప్రహ్లాద్ జోషి కొనియాడారు. ఆయన ప్రారంభించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

# మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి: సీపీఐ

- అవినీతి అధికారులపై విజిలెన్స్ విచారణ జరపాలి
- మాస్టర్ ప్లాన్ ప్రకటించిన తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, జూలై 26 (డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు.

ఆదివారం స్థానిక భాస్కరరావు భవన్‌లో నిర్వహించిన సీపీఐ నగర ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోషిక మోహన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌లో మంజూరైన 257 పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 113 మంది మాత్రమే పనిచేస్తుండగా, 144 పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల ప్రజలకు సరైన సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో సిబ్బంది కొరత కారణంగా అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో రాజకీయ అండదండలతో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ అవినీతి జరుగుతోందని ఆరోపించారు.

రామగుండం నగరానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రజలకు వెల్లడించిన తర్వాతే రోడ్ల విస్తరణ, కూల్చివేతలు చేపట్టాలని, ముందుగా సంబంధిత వారికి నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేతలు చేపడితే కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు మడికొండ ఓదమ్మ, ఆసాల రమ, శనిగరపు చంద్రశేఖర్, సిరిసిల్ల మల్లేష్, కౌన్సిల్ సభ్యులు రాణవేణి సుధీర్ కుమార్, ఆశాల నవీన్, సాదుల శివ, అబ్దుల్ కరీం, తిరుమల, నాయకులు పోతరాజు నాగరాజు, అనూప్ సాయి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో బోనాల జాతర

**భద్రాచలం, జూలై 26 డిడి9 వార్త**

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని భద్రాచలం పట్టణ లోని అశోక్ నగర్ కొత్త కాలనీ ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ అధ్వర్యంలో బోనాల జాతరను ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, అనంతరం మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయాబకి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో పద్దిల్లాలని భక్తులు ప్రార్తించారు. కార్యకవంలో అశోక్ నగర్ కొత్త కాలనీ ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాదూమ ప్రతి ఏడాది అషాడ మాసంలో బోనాల జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహిచ్యామని, ప్రజల సహకారంతో ఈ ఏడాది కూడా వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు.



# శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో శ్రీ మహారుద్ర యజ్ఞం

- జూలై 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు వైభవంగా నిర్వహణ
- శివపార్వతుల కళ్యాణం, మహాపూర్ణాహుతికి భక్తులకు ఆహ్వానం

**పెద్దపల్లి బ్యూరో, జూలై 26 (డీడీ9 వార్త):**

సకల జీవకోటి శ్రేయస్సు, ఆరోగ్యం, శాంతి కోసం పవర్ హౌస్ కాలనీలోని శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో ఈ నెల జూలై 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు శ్రీ మహా రుద్ర యజ్ఞం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది.

యజ్ఞం సందర్భంగా ప్రతిరోజూ ఉదయం గణపతి పూజ, గురు ప్రార్థన, మహన్యాస పారాయణం, రుద్రాభిషేకాలు, సాయంత్రం ప్రత్యేక పూజలు, మహాహారతి, మంత్రపుష్పం, మహాదాశీర్వాదం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జూలై 30న సాయంత్రం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, జూలై 31న గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ, బలి ప్రదానం, మహాపూర్ణాహుతి వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మహాయజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరమశివుని అనుగ్రహాన్ని పొందాలని వంశపారంపర్య అర్చకులు వోజ్జల వెంకటేశ్వర శర్మ మరియు శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయ కమిటీ విజ్ఞప్తి చేశారు.





# రమణక్కపేట గ్రామంలో వీధి లైట్లు, పారిశుద్ధ్య సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నాయకులు మాటూరి ఏడుకొండలు

**మంగపేట జూలై26డీడీ9 వార్త**

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రమణక్కపేట గ్రామపంచాయతీలో ఇప్పటికీ వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, దోమల నివారణ మందు పిచికారీ చేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు మాటూరి ఏడుకొండలు తెలిపారు. గ్రామంలో అక్కడక్కడ జ్వరాల కేసులు నమోదవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టుగా పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు.

అందువల్ల సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల మందు పిచికారీ చేయాలని, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, గ్రామపంచాయతీ నల్లాల ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు



# తబితా ఆశ్రమంలో అంగరంగ వైభవంగా గోరింటాకు వేడుకలు

- ఆషాఢ మాసం సందర్భంగా ఆశ్రమ బాలికలతో మహిళల సందడి
- సహజ గోరింటాకు ప్రాముఖ్యతపై అవగాహన

**పెద్దపల్లి బ్యూరో, జూలై 26 (డీడీ9 వార్త):**

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని తబితా ఆశ్రమంలో ఆదివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆశ్రమ బాలికలకు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆశ్రమ బాలికలకు గోరింటాకు పెట్టి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛంద సంస్థల ఐక్య వేదిక మహిళలు, శ్రీ సీతారామ సేవా సమితి ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్య అతిథి గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ గోరింటాకు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, చర్మవ్యాధులను నివారించడంతో పాటు శరీర వేడిని తగ్గించి అందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. తలకు పెట్టుకుంటే చుండ్రు నివారణకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. కృత్రిమ కోన్లకు బదులుగా సహజసిద్ధమైన గోరింటాకును ఉపయోగించడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని సూచించారు. అనంతరం ఆశ్రమంలోని బాలికలందరికీ రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్, తబితా ఆశ్రమ నిర్వాహకులు విమల, విరేందర్, లెనిన్ శ్రీనివాస్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చేపలు పట్టేందుకు వెళ్లి గోదావరిలో మృత్యువాత

- స్నానం చేస్తుండగా లోతు అంచనా వేయలేక నదిలో మునిగిన వ్యక్తి

**వాజేడు, జూలై 26 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గౌరరపు రామచంద్రమ్ (55) ఆదివారం మధ్యాహ్నం విషాదకర రీతిలో మృతి చెందాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చేపలు పట్టేందుకు అయ్యవారిపేట సమీపంలోని గోదావరి నది శివారుకు వెళ్లిన ఆయన, చేపలు పట్టిన అనంతరం స్నానం చేసేందుకు గోదావరి నదిలోకి దిగాడు. ఈ క్రమంలో నీటి లోతును అంచనా వేయలేక ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పేరూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేరూరు ఎస్ఐ గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు.



# 57 లీటర్ల నాటు సారాయి, ఒక ద్విచక్ర వాహనం పట్టివేత

**భద్రాచలం , జూలై 26 (డిడి9 వార్త )**

భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చర్ల మండలం కలివేరు గ్రామంలోని క్యాంపు కు సమీపం లో ఖమ్మం ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సై సీహెచ్ శ్రీహరి రావు , సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహించగా 40 లీటర్ల నాటు సారాయి తో ఒక ద్విచక్ర వాహనం పట్టుబడింది. తదుపరి భద్రాచలం పట్టణంలోని నాటు సారాయి అమ్మకందారులపై తనిఖీలు నిర్వహించగా 17 లీటర్ల తో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినారు. ద్విచక్ర వాహనం, పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి మొత్తం 57 లీటర్ల నాటు సారాయి, ద్విచక్ర వాహనం ని భద్రాచలం ఎక్సైజు పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుల్స్ వీరబాబు,ప్రసన్న కుమార్,తిరుపతి, ఉపేందర్ లు పాల్గొన్నారు.





# హైదరాబాదు SVKలో అరుణోదయ నాగన్న పాట ఆవిష్కరించిన ప్రముఖులు.

- "విప్లవ సాంస్కృతిక సేనాని నాగన్న" పుస్తకంలో నా పాట ఉండడం అదృష్టం.
- రచయిత, గాయకులు రాగుల శంకర్

**డీ డీ 9 వార్త, ములుగు :**

హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగి అమరుడు అరుణోదయ నాగన్న 50 సంవత్సరాల విప్లవ సాంస్కృతిక సేనాని సంస్మరణ సభలో ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన రచయిత గాయకులు రాగుల శంకర్ రాసి పాడిన పాటను సినీ హీరో ఆర్ నారాయణ మూర్తి, అరుణోదయ విమలక్క, రచయిత యశ్పాల్ నాగన్న కుమారుడు విజయ్ లు ఆవిష్కరించారు.

అరుణోదయ నాగన్న చేసిన పోరాటం త్యాగం తన జీవిత నేపథ్యం మీద తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కొంత మంది రచయితలు అభిమానంతో స్వచ్ఛందంగా రాసిన పాటలన్నింటినీ కలిపి "విప్లవ సాంస్కృతిక సేనాని నాగన్న" ఒక పుస్తకం నిర్మాణం చేశారు ఇందులో ములుగు శంకర్ రాసిన పాట ముద్రించడం జరిగింది. ఈ సందర్భంగా రచయిత రాగుల శంకర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో నాలాంటి ఎందరో కళాకారులకు స్పూర్తిగా నిలిచిన నాగన్న పుస్తకంలో నా పాట ఉండడం అదృష్టంగా భావిస్తున్నా అని అన్నారు. నిస్వార్థ నిజాయితీ జీవి అరుణోదయ నాగన్న ఆశయ బాటలో పయనిస్తానని అన్నారు.



# 18వ వార్డులో కౌన్సిలర్ బైక్ అని అనూష సాగర్ ఆధ్వర్యంలో సర్ ప్రోగ్రాం

**ములుగు, జూలై 26, డీ డీ 9 వార్త :**

ములుగు మున్సిపాలిటీ పరిధిలో నీ 18 వ వార్డులో వార్డు కౌన్సిలర్ బైకాని అనూష సాగర్ ఆధ్వర్యంలో ఆదివారం సర్ ప్రోగ్రాం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిటి సతీష్ వీఆర్ఏ మహేందర్ బి ఎల్ ఓ, బి ఎల్ ఎ జేయక్క, లత, లక్ష్మీకాంతం రవి కుమార్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 31న సింగరేణి భవన్ ముట్టడిని విజయవంతం చేయండి: ఎస్‌సీసీడబ్ల్యూయూ

- నర్సరీ కార్మికులకు ఉపాధి, సులభ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, చట్టబద్ధ హక్కుల అమలుకు పిలుపు

**పెద్దపల్లి బ్యూరో, జూలై 26 (డీడీ9 వార్త):**



నర్సరీ కార్మికులకు ఉపాధి కల్పించాలని, సులభ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, డీఏ బకాయిలు చెల్లించి చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కార్మికులకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.... సింగరేణిలోని 11 ఏరియాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటికీ చట్టబద్ధ హక్కులు అమలు కావడం లేదని అన్నారు. కాంట్రాక్టర్ల న్యాయపరమైన వివాదాల కారణంగా పలువురు కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే సింగరేణి వ్యాప్తంగా 213 సులభ్ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందలేదని, 32 నెలల డీఏ బకాయిలు కూడా చెల్లించలేదని ఆరోపించారు. ఈ సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు.నర్సరీ, సులభ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న జూలై 31 సింగరేణి భవన్ ముట్టడి కార్యక్రమంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆకుల వెంకన్న విజ్ఞప్తి చేశారు.

# కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీల నిరసన

**భద్రాచలం, జూలై 26 డిడి9 వార్త**




రాష్ట్ర టీజీపీఈజేఏసీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యాదాద్రి థర్మల్ పవర్) స్టేషన్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం జేఏసీ జిల్లా కన్వీనర్, భద్రాచలం విద్యుత్తు సంస్థ డీఈ జీవన్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్మికులు ఉద్యోగులు ఉద్యోగుల సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరిస్తే ఉద్యోగులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈజేఏసీ కార్యవర్గ సభ్యులు ఏడీఈ నరసింహారావు, వెంకట్రావు, రామకృష్ణ, ఉదయ్, కేటీఎన్ మూర్తి, పెదరాజు, ప్రవీణ్, రాజారావు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

**మంగపేట జూలై 26డీడీ 9 వార్త**

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ, ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పెద్ది సుదర్శన్ రెడ్డి కి ఆయురారోగ్యాలు ప్రసాదించి, త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా క్షేత్రంలోకి రావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ములుగు మండల మాజీ పార్టీ అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి, జిల్లా నాయకులు వేములపల్లి భిక్షపతి, అకుతోట చంద్రమౌళి, రఘు, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, గండి కుమార్, బైకని సాగర్, పైడిమల్ల భాస్కర్, ఉయ్యాల భద్రయ్య, దొడ్డిపెల్లి రఘుపతి, బీఆర్ఎస్ నాయకులు కొనుకటి ప్రశాంత్, సిద్ధు, చంటి, రాజశేఖర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.





## సాహు మహారాజ్ జయంతి వేడుకల్లో బీఎస్పీలో చేరిన యువకులు

**జనగామ, జూలై 26:**

రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.

కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో జనగామ మండలం చీటకోడూరు గ్రామానికి చెందిన హరీష్, ప్రణయ్, శివకుమార్, భార్గవ్ బీఎస్పీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు వారికి పార్టీ కండువాలు కప్పి సభ్యత్వం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన హరీష్ మాట్లాడుతూ, బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ కుమారి మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ నాయకత్వంపై విశ్వాసంతో ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు.




## ములుగు జిల్లా, కుమ్మర్ల సంఘం అధ్యక్షునిగా కందికొండ అశోక్

**ములుగు, జూలై 26, డిడి 9 వార్త :**

తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల సంఘం అధ్యక్షులు నడికుడ జయంతరావు సూచన మేరకు, ఉపాధ్యక్షలు ఓదెల చందర్ రావు మరియు ములుగు జిల్లా గౌరవ అధ్యక్షులు ఆషాడపు దేవందర్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా నూతన కమిటీ నీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులుగా కందికొండ అశోక్, ఉపాధ్యక్షులు గా మరిపెల్లి రాజమల్లు, ప్రధాన కార్యదర్శి గా కొత్తపల్లి విజెందర్, కోశాధికారిగా ఓదెల రమేష్,ఉపాధ్యక్షులుగా వేములపెల్లి రాజు, సరిగొప్పుల వెంకన్న, కార్యదర్శి గా తిమ్మాపురపు నాగరాజు, సహాయ కార్యదర్శిగా పాలడుగుల రాకేష్, కార్యవర్గ సభ్యులుగా నెల్లుట్ల రమేష్,నెల్లుట్ల సుమన్,వేములపల్లి నాగరాజు,నేదునూరి ఈశ్వర్, చెల్పూరి రాజు, కందికొండ రమేష్,జిల్లా గౌరవ సలహాదారులుగా ఆషాడపు దేవేందర్ గారిని, అలాగే జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గా వేములపెల్లి స్వామిని జిల్లా గౌరవ సలహాదారులుగా చెల్పూరి రాజుకుమార్, కొమరంపాలెం ధర్మారావు ని, అలాగే కొత్తపల్లి బాబురావు ని మరియు ఇదే కార్యక్రమం క్రమంలో జిల్లా యువజన విభాగని కూడ ఎన్నుకోవడం జరిగింది. జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా ముప్పారపు రమేష్, ఉపాధ్యక్షునిగా ఓదెల సాయితేజ నీ ఎన్నుకోవడం జరిగింది. అలాగే రాజకీయ విభాగం తరుపున పొట్లపూర్ సర్పంచ్ ని కూడ నియమించడం జరిగింది. జిల్లా



అధ్యక్షునిగా ఎన్నికైనటువంటి కందికొండ అశోక్ మాట్లాడుతు, జిల్లా గౌరవ అధ్యక్షులు, మరియు మాజీ అధ్యక్షులు సలహా సూచనలతో అలాగే కమిటీ అందరి సమన్వయంతో ముందుకు సాగుతు ఎల్లపుడు సంఘం అభివృద్ధికి పాటుపడుతనని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా అధ్యక్షులు అవునూరి రామన్న , మరియు వరంగల్ యువజన సంఘం అధ్యక్షులు పోతుగంటి రాజశేఖర్ అలాగే ములుగు జిల్లా కుల బంధువులు పాల్గొన్నారు. అశోక్ మాట్లాడుతు నూతన కమిటీ ఆధ్వర్యంలో ఎర్రిగట్టమాకు కుమ్మరుల అమ్మవారు తొలి బోనం సమర్పించుటకు ఆగస్టు 5బుధవారం ను నిర్ణయిస్తూ ఈ రోజు జరుగు కార్యక్రమం లో కుల భాంధవులు,మరియు మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ అశోక్ రాథోడ్

- **- ఓమ్లా నాయక్ తండా సర్పంచ్ సుమిత్రా రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలు**
- **- సమాజ సేవలో అశోక్ రాథోడ్ సేవలు చిరస్మరణీయం**
- **- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన సేవామూర్తి**
- **- కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలు**
- **- ఆదర్శ వైద్యునికి ఓమ్లా నాయక్ తండా గ్రామస్తుల ఘన నివాళి**





**పెద్దేముల్,జూలై 26 (డిడి9 వార్త):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని ఓమ్లా నాయక్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ డీసీసీ సభ్యుడు, తట్టేపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్, సర్పంచ్ గా సుధీర్ఘకాలంగా ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసి, తాండూరు మహారాజుల కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరు పొందిన స్వర్గీయ మోహన్ సింగ్ కుమారుడు ప్రముఖ ఆర్థో పెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అశోక్ రాథోడ్ జయంతి వేడుకలను ఆదివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ సుమిత్రా రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొని గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అశోక్ రాథోడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిముషాల పాటు మౌనం పాటించి స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుమిత్రా రాథోడ్, గ్రామ పెద్దలు ప్రేమ్ కుమార్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తట్టేపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ ఉప్పరి మల్లేశం తదితరులు మాట్లాడుతూ డాక్టర్ అశోక్ రాథోడ్ వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా నిస్వార్థ సేవగా భావించి సుమారు పదేళ్లపాటు ఎంతో మంది నిరుపేదలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించారని కొనియాడారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, తన సేవా దృక్పథంతో అందరి అభిమానాన్ని సంపాదించుకున్న మహోన్నత వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు.ఒక వ్యక్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలంటే సేవా తపన, అంకితభావం, మానవత్వం అవసరమని,ఆ లక్షణాలన్నీ కీర్తిశేషులు డాక్టర్ అశోక్ రాథోడ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామస్తులు,యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు అంకితమవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాయిని నారాయణ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ ఎండీ రియాజ్, గ్రామ పెద్దలు లక్ష్మణ్ రాథోడ్, పోలీస్ వినోద్, శంకర్ నాయక్, మిథున్, సంజు, మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ అశోక్ రాథోడ్‌కు ఘన నివాళులర్పించారు.

## వాజేడు కాంగ్రెస్‌కు తీరని లోటు

- **సీనియర్ కాంగ్రెస్ నేత దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబురాజు కన్నుమూత**
- **గుండెపోటుతో తుదిశ్వాస.. శోకసంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు**

**వాజేడు, జూలై 26 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబురాజు ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వాజేడు మండల కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా నిలిచిన నాయకుడిని కోల్పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

వారం రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లిన ప్రసాద్ బాబురాజు అక్కడ అస్వస్థతకు గురయ్యారు. అనంతరం కాకినాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.



ప్రసాద్ బాబురాజు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన సేవలు కాంగ్రెస్ పార్టీకి చిరస్మరణీయమని పార్టీ నాయకులు కొనియాడారు.

ఆయన మరణం వాజేడు మండల కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పలువురు నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఆదివారం సాయంత్రంలోపు వాజేడు మండల కేంద్రంలోని ఆయన స్వగృహానికి తీసుకురానున్నారు. సోమవారం అంతిమ యాత్ర, అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## భద్రాచలంలో తూనికల కొలతల శాఖ కొరడా..

- **కాటా మోసాలకు పాల్పడిన 14 మంది వ్యాపారులకు జరిమానా**
- **కస్టమర్లను మోసగిస్తే కఠిన చర్యలు-- భద్రాచలంలో తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ సుభాష్ హెచ్చరిక**

**భద్రాచలం, జూలై 26 (డిడి9 వార్త)**

భద్రాచలం పట్టణంలో ఆదివారం తూనికల కొలతల అధికారి సుభాష్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని చికెన్ మార్కెట్ అంబేద్కర్ సెంటర్ పాత కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి తప్పుడు కొలతలతో వ్యాపారం చేస్తున్న 14 మంది వ్యాపారస్తులకు జరిమానా విధించారు. ప్రధానంగా చికెన్ మార్కెట్లో పలువురు వ్యాపారస్తులు కాటా మోసానికి పాల్పడుతున్నారని తేల్చి వారికి హెచ్చరికలు జారీ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులను ఉద్దేశించి తూనికల కొలతల ఇన్స్‌పెక్టర్ సుభాష్ మాట్లాడుతూ వినియోగదారుడికి న్యాయమైన కొలతలతో వస్తువులను విక్రయించాలని సూచించారు. కాటా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారుల సైతం కాటా మోసాలను గ్రహించాలని కోరారు. ఏ వ్యాపారైన ఖాతా మోసానికి పాల్పడితే తూనికల కొలతల కార్యాలయానికి సమాచారాన్ని అందివ్వాలని ప్రజల్ని సుభాష్ కోరారు. పట్టణంలో అకస్మాత్తుగా తూనీల కొలతలు అధికారులు తనిఖీ చేయడం పట్ల పలువురు హర్షణ వ్యక్తం చేస్తున్నారు.

## చాయ్ పే చర్చలో ప్రజల సమస్యలు విన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**కామారెడ్డి, జూలై 26(డిడి9 వార్త):**

నిజాంసాగర్ మండలంలోని నర్సింగరావుపల్లి చౌరస్తాలో నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మరియు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ స్థానిక ప్రజలతో కలిసి చాయ్ తాగుతూ వారి సమస్యలు, అభిప్రాయాలు, గ్రామ అవసరాలను స్వయంగా తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించిన నాయకులు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఓపికగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొంటూ, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## బిచ్కుంద మార్కెట్ యార్డ్‌లో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం..

- **పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమీక్ష సమావేశంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు.సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఆయన, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రతి అర్హులైన ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా కృషి చేయాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# మద్నూర్‌లో ఘనంగా కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- **అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు**
- **రూ.2 కోట్లతో నూతన ఎంఆర్వో భవన నిర్మాణానికి అనుమతులు, త్వరలో పనుల ప్రారంభం**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులతో మద్నూర్‌లో నూతన మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో) కార్యాలయ భవన నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వెల్లడించారు.ఆధునిక సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కొత్త భవనం అందుబాటులోకి రావడం ద్వారా ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందుతాయని చెప్పారు.జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు, ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధి వంటి రంగాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడి ఇంటి వరకు చేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,



కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలి: సర్పంచ్ అరిగే ధర్మతేజ

**బాన్సువాడ, జూలై 26(డిడి9 వార్త):**

బీర్కూర్ గ్రామంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు అందరూ తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ సూచించారు.ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులు వెంటనే తమ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించే అవకాశం ఉందని తెలిపారు.ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు జూలై 31 చివరి తేదీగా నిర్ణయించబడినందున, అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఎలాంటి ఆలస్యం చేయకుండా రేషన్ దుకాణంలో ఈకేవై



సీ పూర్తి చేసుకోవాలని సర్పంచ్ అరిగే ధర్మతేజ విజ్ఞప్తి చేశారు.

# పోతంగల్ బస్టాండ్‌లో యాచకులకు టిఫిన్, వాటర్ ప్యాకెట్ల పంపిణీ

**బాన్సువాడ, జూలై 26(డిడి9 వార్త):**

పోతంగల్ బస్టాండ్‌తో పాటు పరిసర గ్రామాల బస్టాండ్ ఆవరణల్లో ఆశ్రయం పొందుతున్న యాచకులకు లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సితాలే రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వర్షాల కారణంగా భోజనం దొరకని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాచకులకు టిఫిన్‌తో పాటు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తన అన్న సితాలే అశోక్ జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సితాలే రమేష్ తెలిపారు.సమాజంలో నిరుపేదలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ పటేల్ హూన్స, ముస్లిం సోదరులు, గ్రామ ప్రజలు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# బిచ్కుందలో నేడు ఎమ్మార్పీఎస్–ఎమ్మెస్పీ అనుబంధ విభాగాల జిల్లా అత్యవసర సమావేశం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ విభాగాల అత్యవసర జిల్లా సమావేశంలో భాగంగా కామారెడ్డి జిల్లా స్థాయి సమావేశం బిచ్కుంద మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జరగనున్నట్లు ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంథని సామ్యేల్ మాదిగ తెలిపారు .ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కామారెడ్డి జిల్లా పరిధిలోని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ విభాగాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సంస్థ బలోపేతం,



ప్రస్తుత సామాజిక -రాజకీయ అంశాలు, భవిష్యత్ కార్యాచరణతో పాటు పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల బాధ్యులు, నాయకులు సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- **నలుగురిపై కేసు నమోదు.. నగదు, మొబైల్ ఫోన్లు, బైక్‌లు స్వాధీనం**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

జిల్లాలో జూదాన్ని అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా బీబీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాదారం గ్రామ శివారులో నిర్వహించిన దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించిన పోలీసులు ఘటన స్థలంలో పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు.వారి వద్ద నుంచి రూ.7,662 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.





# బాధిత కుటుంబాలను పరామర్శించిన కాసుల రోహిత్

**బాన్సువాడ, జూలై 26 (డీడీ9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని బరంగ్ఏడ్గి గ్రామంలో ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయిన రెండు కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, బాన్సువాడ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్ ఆదివారం పరామర్శించారు.కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గొండ్ల శ్రీనివాస్ తండ్రి గొండ్ల నడిపి సైదయ్య, అలాగే జర్నలిస్ట్ గాజుల పండరి తల్లి గాజుల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి నివాసాలకు వెళ్లిన కాసుల రోహిత్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఆ బాధ నుంచి కుటుంబ సభ్యులు ధైర్యంగా బయటపడాలని ఆకాంక్షించారు.అవసరమైన సమయంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీ బిన్ అబ్దుల్లా, మధుసూదన్ రెడ్డి, దొంతురం కాశిరాం, తోట ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ గొండ్ల రాజు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సందుల రవి, మాజీ సర్పంచ్ ఇందూర్ లక్ష్మన్, సీనియర్ జర్నలిస్ట్ కాదేపురం గంగన్న, ఇందూర్ గజేందర్, కుర్మ నాగుగొండ, వడ్ల నాగయ్య, బుజ్జి గొండ, నల్లి లక్ష్మన్, నీరడి రాములు, బోయి సాయిలు, శావులం శంకర్, కోమటి గణేష్, గైని సాయిలు, అన్న సాయిబాబు, క్యాదని లింగప్ప, గాజుల గజేందర్, గాజుల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.






# కౌలాస్ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ కౌలాస్ ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.కౌలాస్ గ్రామానికి చెందిన అడ్వకేట్ అనుప్ కుమార్ సింగ్ దొర కుమారుడు అన్మోల్ సింగ్ వివాహానంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వారి ఆహ్వానం మేరకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం నూతన దంపతులు అన్మోల్ సింగ్ దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.





# గంప శశాంక్ జన్మదినం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఎల్పుగొండ గ్రామంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు గంప శశాంక్ జన్మదినాన్ని పురస్కరించుకుని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం జీవితాంతం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు పర్ష వెంకటరమణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంబోతుల రాజగౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు పులిమామిడి దేవరాజు, సర్పంచ్ విద్యాసాగర్, ఉపసర్పంచ్ రవి, సాయి రెడ్డి, అంకం బాలకిషన్, తోట రామ్మోహన్, రామ్మూర్తి, నర్సింలు, ప్రశాంత్ రెడ్డి, భూపతి, రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్ విఠలేశ్వర్ ఆలయంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**బాన్సువాడ, జూలై 26(డిడి9 వార్త):**

ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఉపవాస దీక్షలు ఆచరించిన భక్తులు ద్వాదశి రోజున ఉపవాస విరమణ చేసేందుకు బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర్ మందిర్‌లో బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రేమతో ప్రసాద భోజనాన్ని వడ్డించారు. సేవా కార్యక్రమంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ స్వయంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు,



ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికులకు ఘన సన్మానం

**పోతంగల్/కోటగిరి/, జూలై 26/ (డిడి9 వార్త):**

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ గౌడ్స్ కాలనీలో మాజీ సైనికులకు ఘన సన్మానం నిర్వహించారు. గౌడ్స్ కాలనీ కమిటీ అధ్యక్షులు జుక్కల్వార్ గంగాధర్ పటేల్ ఆధ్వర్యంలో కాలనీ వాసుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించిన మాజీ సైనికులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన కెప్టెన్ శ్రీ శైలూ, సార్జెంట్ చిన్న దావులు, హవల్దార్ లాలయ్య, హవల్దార్ నాగనాథ్, హవల్దార్ డి. నాగరాజు, హవల్దార్ ఎం. సంజీవ్ కుమార్, హవల్దార్ ఆర్. రాజేశ్వర్, హవల్దార్ శివకృష్ణ, హవల్దార్ సలీంలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికులు అందిస్తున్న సేవలు, చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. దేశ ప్రజల భద్రత కోసం సైనికులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందిన అమరవీరుల త్యాగాలను భారతదేశం ఎన్నటికీ మరువదని అన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశ రక్షణలో సేవలందించిన మాజీ సైనికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో యువత దేశ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ సైనికులను సన్మానించడం తమకు ఎంతో గర్వకారణమని, వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటామని తెలిపారు.

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం ద్వారా దేశ రక్షణలో సైనికుల త్యాగాలు, సేవలకు సమాజం అందించే గౌరవానికి ప్రతీకగా నిలిచింది. దేశ భక్తి, సైనికుల పట్ల గౌరవభావాన్ని చాటిచెప్పిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక గుర్తింపును పొందింది. కార్యక్రమంలో కాలనీ వాసులు, కమిటీ సభ్యులు, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.




## భారత సైనికుల త్యాగమే దేశానికి రక్ష

- **కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సైనికులకు ఘన సన్మానం**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డీడీ9 వార్త):**

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో భారత సైనికులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అపూర్వ సాహసం, వీరోచిత పోరాటం వల్లే దేశం విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. దేశ ప్రజల ప్రాణాలు, సరిహద్దుల భద్రత కోసం నిత్యం అప్రమత్తంగా విధులు నిర్వర్తించే భారత సైనికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు.దేశ రక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడని ధైర్యవంతులే భారత సైనికులని, వారి త్యాగం ప్రతి భారతీయుడు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. దేశ యువత ఎక్కువ సంఖ్యలో సైన్యంలో చేరి దేశసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో విధులు నిర్వహిస్తున్న బండి ప్రభాకర్, మొతాజీ బాలకిషన్, రిటైర్డ్ మిలిటరీ సైనికులు షేక్ గౌస్ ఉద్దీన్, ఏదుల్లా రంజిత్ రెడ్డిలను ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు.కార్గిల్ యుద్ధంలో దేశం కోసం అమరులైన 527 మంది భారత సైనికులకు నివాళులర్పిస్తూ, వారి త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ చిలువేరి మారుతి, కార్యదర్శి కిరణ్ కుమార్, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు పర్ష వెంకటరమణ, కొంక దేవేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్లం కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం

- **ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు, అర్హుల పేర్ల చేర్పు, అనర్హుల తొలగింపు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన వారికి దరఖాస్తుల ప్రక్రియలో సహకరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని నాయకత్వం పిలుపునిచ్చింది.



## రోగికి మనోధైర్యం నింపిన 108 సిబ్బంది..

- **సకాలంలో చికిత్సతో ప్రాణాపాయం తప్పింపు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**



అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందిస్తూ రోగులకు మనోధైర్యం కల్పించి ప్రాణాలను కాపాడడంలో 108 అంబులెన్స్ సిబ్బంది మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం గుండెనెమ్లి గ్రామానికి చెందిన మానేవ్వ (73) వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శుక్రవారం బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం ఆమెకు ఆకస్మికంగా ఫిట్స్ రావడంతో పరిస్థితి విషమించింది. వైద్యులు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించగా, సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించారు. ప్రయాణం మొత్తం రోగికి అవసరమైన అత్యవసర వైద్య సేవలు అందిస్తూ, ధైర్యం చెప్పి, సురక్షితంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.108 అంబులెన్స్‌లో విధులు నిర్వహించిన ఈఎంటీ ప్రసాద్ మరియు పైలెట్ పుండరీకం సేవలను రోగి కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల రోగికి సకాలంలో వైద్యం అందిందని వారు పేర్కొన్నారు.

## సదాశివనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించిన ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు రైతు వేదికలో ప్రజలతో సమావేశమై గ్రామ భద్రత, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు. మోసాలకు గురైన వెంటనే సంబంధిత హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.అదేవిధంగా యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనుమానాస్పదంగా మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.గ్రామాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.సీసీ కెమెరాలు నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## కార్గిల్ అమరవీరులకు నివాళిగా రక్తదాన శిబిరం

- **మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పిలుపు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 26(డిడి9 వార్త):**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇది వారికి అర్పించే గొప్ప నివాళి అని అన్నారు. ఒక రోజు చేసే రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని, ప్రాణదానం కంటే గొప్ప సేవ మరొకటి లేదని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, సమాజంలో రక్త కొరతను నివారించేందుకు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు భూపతి, పాపిరెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ రాజన్న, కరస్పాండెంట్ నర్సింగ్ రావు, జాయింట్ సెక్రటరీ సాయన్న, వైస్ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, ట్రెజరర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.








## భీంగల్ చొక్కయ్య గుట్ట అన్నసత్రానికి వంట సామాగ్రి విరాళం

**నిజామాబాద్, 26 జూలై (డీడీ9 వార్త):**

భీంగల్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చొక్కయ్య గుట్ట అన్నసత్రం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని దాతలు జొన్నల భూపాల్, శిరీష దంపతులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అన్నసత్ర నిర్వహణకు అత్యంత కీలకమైన పూర్తి వంట సామాగ్రిని వారు స్వచ్ఛందంగా విరాళంగా అందజేశారు. అన్నసత్రానికి వంట సామగ్రిని విరాళంగా అందించిన భూపాల్, శిరీష దంపతులను ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, దాతలను ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో వారి ఉదారతటి ఇతర దాతలకు కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## లింబాద్రి స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తుల ప్రత్యేక పూజలు

- **భీంగల్ లో నూతన కోర్టు ప్రారంభం**

**నిజామాబాద్, 26 జూలై (డీడీ9 వార్త):**

భీమ్‌గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం సందర్శించారు. జస్టిస్ తంగిరాల మాధవీ దేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి తదితరులు ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నంబి పార్థసారథి సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికి, ఆలయ చరిత్రను వివరించగా... వేదమంత్రోచ్చారణల మధ్య పూజలంతరం న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటన నేపథ్యంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, భీమ్గల్ సీఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటయింది.

**భీమ్‌గల్‌లో నూతన కోర్టు ప్రారంభం - తొలి కేసుల విచారణ**

ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం భీమ్‌గల్‌లో నూతన కోర్టు భవనాన్ని హైకోర్టు న్యాయమూర్తులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్టు బెంచిపై ఐదు సివిల్ కేసులను విచారణకు స్వీకరించి ట్రయల్ నిర్వహించారు. ఈ నూతన కోర్టు ఏర్పాటుతో మండల ప్రజలకు స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని, ఇకపై చిన్నచిన్న కేసుల కోసం ఆర్మూర్ వెళ్లాల్సిన శ్రమ తప్పుతుందని అధికారులు తెలిపారు. ఈ కోర్టు ఏర్పాటు వెనుక కృషి చేసిన ఆర్మూర్ న్యాయమూర్తి శ్రీదేవితో పాటు సహకరించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో విషాదం

- నలుగురు యువకులు గల్లంతు
- ముగ్గురి మృతదేహాలు లభ్యం

**నిజామాబాద్, 26 జూలై (డీడీ9 వార్త):**

ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. సరదాగా విహారయాత్రకు వెళ్లిన నలుగురు యువకులు ప్రమాదవశాత్తు వరద కాలువలో జారిపడి గల్లంతయ్యారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా, వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని బొకర్‌కు చెందిన అర్బాన్, నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన కలీం, అమ్ము @ నజువత్, అజీమ్ లు కలిసి ఎస్ఆర్ఎస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతానికి విహారయాత్ర నిమిత్తం వెళ్లారు. ఈ క్రమంలో వరద కాలువ సమీపంలో ప్రమాదవశాత్తు కాలుజారి వేగంగా ప్రవహిస్తున్న నీటిలో పడి గల్లంతయ్యారు.

ఈ దుర్ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా రంగంలోకి దిగి గాలింపు చేపట్టాయి. నీటి ప్రవాహం తీవ్రంగా ఉన్నప్పటికీ సిబ్బంది శ్రమించి నలుగురిలో ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. ఆచూకీ లభించని మరో యువకుని కోసం గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, రూరల్ సీఐ జాన్ రెడ్డి, ముప్కాల్ ఎస్ఐ సుహాసిని తదితరులు పాల్గొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.



యువకుల మృతి పట్ల నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్షాకాలంలో ప్రాజెక్టులు, బ్యాక్‌వాటర్ ప్రాంతాలు, వరద కాలువలు, నదుల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగడం, ఈత కొట్టడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. నీటి లోతు, ఉధృతి తెలియని ప్రాంతాలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, పోలీసు శాఖ హెచ్చరికలను ప్రజలు విధిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.







## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్, 26 జూలై (డీడీ9 వార్త):**

నిజామాబాద్ నగరంలో బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. మహాలక్ష్మి నగర్, పాత కలెక్టరేట్ అమ్మవారి ఆలయంలో తెలంగాణ గెజిటెడె అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ మట్టి వాసనలను, సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప పండుగ బోనాలు అని ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అభివర్ణించారు. ఇలాంటి పర్వదినాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సమాజంలో శాంతిసౌఖ్యాలు వెల్లివిరిసేలా చేస్తాయని ఆయన అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా మాతంగి నాని యాదవ్ సమర్పించిన బోనం, వారి విశేష నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్, 26 జూలై (డీడీ9 వార్త):**

విజయ్ దివస్‌ను పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి వీరజవానులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశ సరిహద్దులను కాపాడుతూ ప్రాణాలర్పించిన వీరజవానుల త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ కొనియాడారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించేందుకు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన జవానుల శౌర్యపరాక్రమాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. సైనికుల దేశభక్తి నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.



## ఘనంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డి డి 9 వార్త) జులై 26**



తలమడుగు మండలం పల్లి బి గ్రామంలో. బోధిసత్వ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. విగ్రహావిష్కరణ. కార్యక్రమం ఘనంగా జరిగింది..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా.ఎమ్మెల్యే అనిల్ జాదవ్. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు. హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.. రచించిన రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించాయని. ఈ దేశంలో ప్రతి పౌరుడు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ. తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు

మాజీ ఎమ్మెల్యే. రాథోడ్ బాపురావు మాట్లాడుతూ. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల. తాను. బోథ్ నియోజకవర్గానికి. రెండుసార్లు. ఎమ్మెల్యేగా ఎన్నికయి ప్రజలకు సేవ చేశానని. తన సొంత నిధులతో. బోత్ నియోజకవర్గంలో.దాదాపుగా 80 కి పైగా.విగ్రహాలు. స్థాపించానని తెలిపారు. అందులో పల్లి బి గ్రామం కూడా ఒకటి. అని అన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్. ప్రపంచ మేధావి స్వేచ్ఛ సమానత్వం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహనీయుడు. అని ఆయన కొనియాడారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలకు. అనుగుణంగా నడుచుకొని తమ హక్కులను కాపాడుకొని. రాబోయే రోజుల్లో కూడా. తన సొంత నిధులతో. మరిన్ని అంబెద్కర్ విగ్రహాలు కూడా. అవసరమైన గ్రామాలలో ఏర్పాటుచేస్తానని. ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో. స్థానిక సర్పంచ్. సంజీవ్.. నాయకులు మొట్టే కిరణ్ కుమార్. నిమ్మల గజానన్. బోండ్ల రమేష్.. మామూళ్ల రాములు. బోనగిరి అశోక్ శ్రీనివాస్. గ్రామస్తులు. మహిళలు. యువకులు.. మరియు అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు



# మూడో టీ20 కూడా మనదే... జింబాబ్వేపై టీమిండియా క్లీన్ స్వీప్

- మూడో టీ20లో జింబాబ్వేపై 35 పరుగుల తేడాతో భారత్ విజయం
- మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా
- అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ (81)
- బంతితో మయాంక్ యాదవ్ (3 వికెట్లు), యశ్ ఠాకూర్ (2 వికెట్లు) రాణింపు
- జింబాబ్వే తరఫున రియాన్ బర్ల్ (54*) ఒంటరి పోరాటం

**అఖండ సూర్య :**




జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 30 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరే (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.

## పేకాట స్థావరం పై పోలీసుల దాడి....

- నలుగురు అరెస్ట్.. నగదు, పేకాట ముక్కలు..
- మొబైల్ ఫోన్లు స్వాధీనం..

**మెదక్ జూలై 26 (డి డి 9 వార్త)**

మెదక్ పట్టణంలోని దయారా కాలనీ కల్లు కాంపౌండ్ సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మెదక్ టౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నగదు, పేకాట ముక్కలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మెదక్ పట్టణ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించగా, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు పట్టుకోవడం జరిగిందన్నారు. అరెస్టు చేసిన వారిలో దయారా కాలనీ కి చెందిన ఎల్లబోయిన రమేష్ (36), అన్నరాసి దుర్గేష్ (27), నర్సిఖేడ్ గ్రామానికి చెందిన కందెల శైలూ (42), కందెల కిషన్ (31) ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.4,878 నగదు, 52 పేకాట ముక్కలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. విచారణలో నిందితులు పేకాట ఆడుతున్నట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పేకాట వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 / 112 లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
సోమవారం
27-07-2026
హైదరాబాద్

## వినోదాల... సౌండ్ ఇంజినీర్

కథానాయకుడు నారా రోహిత్ సరికొత్త కథతో ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమయ్యారు. ఆయన.. కథానాయిక నయన్ సారిక జంటగా రూపొందుతున్న సినిమా 'సౌండ్ ఇంజినీర్'. చినిమిల్లి మణికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ చౌదరి చెరుకూరి నిర్మిస్తున్నారు. శనివారం రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా ఓ కాన్సెప్ట్ వీడియోతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కొత్త అవతారంలో కనిపిస్తున్న రోహిత్ పాత్రని వినికిడి లోపం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్దినట్టు స్పష్టం చేసింది. ఈ సినిమాలో నరేశ్ వీకే, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, రోహిణి, సంపత్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.



## ఆత్మకథ రాయనున్న సూపర్‌స్టార్.. సినిమాగా కూడా రానుందా?

సూపర్‌స్టార్ రజనీకాంత్ (Rajinikanth) అభిమానులకు ఓ శుభవార్త. ఆయన తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారని నెట్టింట వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఆయన బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, రజనీకాంత్ కొంతకాలంగా ఈ పుస్తకం రాసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. కేవలం పుస్తకమే కాకుండా, ఈ ఆత్మకథను సినిమాగా (బయోపిక్) కూడా తీసుకురావాలని ఆయన భావిస్తున్నారట. ఈ ఆలోచనపై తనకు అత్యంత సన్నిహితులైన వారితో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, పుస్తకం లేదా సినిమాపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

ఇక, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 15న విడుదల కానుంది. ప్రస్తుతం 'ధర్మన్' మూవీ షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు.



## మెగాస్టార్ బర్త్ డే కానుకగా 'మెగా158' నుంచి బిగ్ అప్డేట్.!



మెగాస్టార్ చిరంజీవి వరుస భారీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అభిమానులను అలరించడంతో పాటు యంగ్ హీరోలకు పోటీగా నిలుస్తున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర' విడుదల కాకముందే.. టాలెంటెడ్ డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ చిత్రాన్ని లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ మూవీపై భారీ అంచనాలు భారీగా నెలకొన్నాయి. 'మెగా158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అత్యంత ఘనంగా నిర్మిస్తున్నారు.

యాక్షన్ అండ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో కోలీవుడ్ సీనియర్ నటుడు శరత్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, కమెడియన్ డాక్టర్ భద్రం కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నప్పటికీ, మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక పోస్టర్ లేదా అప్‌డేట్ రాలేదు. దీంతో ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని మెగా అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగా ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించే ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వచ్చే నెల ఆగస్ట్ 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భం గా ఈ సినిమాకు సంబంధించిన ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోందని టాక్.

## ఇతరులను చూసి నన్ను నేను మార్చుకోలేదు..

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ఎన్నో హిట్ చిత్రాలతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీ అయిపోయారు. లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఎలాంటి డూప్ లేకుండా స్వయంగా రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. 'మైసా'లో అండర్ వాటర్‌లో బిగ్ అడ్వెంచర్ చేశారు. ఇప్పటివరకూ ఇండియన్ సినీ చరిత్రలో చూడని ఓ బిగ్ సీక్వెన్స్ చేసి రికార్డ్ క్రియేట్ చేశారు. గొండ్ తెగ, సంస్కృతి నేపథ్యంతోపాటు వారికి అండగా ఉండే ఓ వారియర్ పాత్రలో గొండు మహిళగా రష్మిక ఇందులో కనిపించబోతున్నారు. రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ బిజీగా ఉన్న రష్మిక తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా సినీ ఇండస్ట్రీలో అందరూ వెళ్లే దారిలోనే తాను వెళ్లలేదని.. ఎప్పుడూ తన మనసుకు నచ్చినట్లే నడుచుకున్నానని చెప్పారు. అదే తన విజయంలో అతిపెద్ద కారణమని వెల్లడించారు.

హిందీ సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్న సమయంలో అందరిలా ఒకే తరహా దారిలో వెళ్లకుండా, తన అంతరాత్మ చెప్పిన మాటే విన్నానని అందుకే ఈ స్థాయిలో ఉన్నానని రష్మిక అన్నారు. మొదట్లో ఈ నిర్ణయం కాస్త భయాన్ని కలిగించినప్పటికీ, చివరికి అదే ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీని తెచ్చిపెట్టిందని చెప్పారు. ఇతరులను అనుకరించడం లేదా పక్కవారి మెప్పు కోసం జీవించడం కాకుండా.. ఎవరికి వారు తమ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయమని అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని ఇస్తూ.. ఎవరినీ చూసి కాపీ కొట్టాల్సిన అవసరం లేదు. పక్కవారి మెప్పు కోసం లేదా ప్రశంసల కోసం మిమ్మల్ని మీరు మార్చుకోకండి. మనం ఎలా ఉన్నామో అలాగే నిజాయితీగా ఉండటంలోనే మన అసలైన విలువ ఉంటుంది. మన వ్యక్తిత్వమే మనకు అతిపెద్ద బలం అని స్పష్టం చేశారు.




## ఓటీటీ ఎంట్రీకి సిద్ధమైన శ్రీకాంత్ 'ఆబ్జెక్షన్ మై లార్డ్'..

టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'ఆబ్జెక్షన్ మై లార్డ్ - నోటరీ పరశురామ్: చాప్టర్ 1'. ఇందులో ముఖేష్ రిషి ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ తెలుగు ఓటీటీ ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేసేందుకు సిద్ధమైంది. జీ5 ఈ వెబ్ సిరీస్‌ను జూలై 31 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన పోస్టర్ సిరీస్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌లో శ్రీకాంత్, ముఖేష్ రిషి ఒకరినొకరు తీవ్రంగా ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తుండగా, దిగువన మంటల్లో చిక్కుకున్న వ్యక్తి విజువల్ కథపై మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. న్యాయం, నేరం, కుట్రల నేపథ్యంలో సాగే కోర్ట్‌రూమ్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ రూపొందినట్లు పోస్టర్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ వెబ్ సిరీస్‌కు సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వం వహించగా, డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మించారు. అరుణ్ చిలువేరు సంగీతాన్ని అందించారు.




## ఆంధ్ర హక్కులకు అన్ని కోట్ల డిమాండ్ చేస్తున్న 'ది ప్యారడైజ్' మేకర్స్



నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన అన్ని ఏరియాల థియేట్రికల్ హక్కులను విక్రయించేందుకు నిర్మాతలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రి సంస్థ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం రాయలసీమ మినహా ఆంధ్ర ఏరియా థియేట్రికల్ హక్కుల కోసం మేకర్స్ రూ.35 నుంచి రూ.40 కోట్ల మధ్య ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రాయలసీమ లేకుండానే ఆంధ్ర హక్కులకు ఇంత భారీ మొత్తం డిమాండ్ చేయడం విశేషంగా మారింది. ఈ పెట్టుబడిని రికవరీ చేయాలంటే ఆంధ్ర ప్రాంతంలోనే దాదాపు రూ.70 నుంచి రూ.80 కోట్ల గ్రాస్ వసూళ్లు రావాల్సి ఉంటుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాంటి స్థాయి కలెక్షన్లు సాధించాలంటే సినిమాకు సూపర్ హిట్ టాక్ రావడం తప్పనిసరి అని వారు భావిస్తున్నారు. మరి చివరికి రాయలసీమ మినహా ఆంధ్ర ఏరియా హక్కులు ఎంత మొత్తానికి అమ్ముడవుతాయో ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో ఖయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చేరుకూరి నిర్మిస్తున్నారు.

## కారు కొనుక్కోవడానికే సినిమాల్లోకి వచ్చా

కారు కొనాలనే కోరికతో నటించిన తొలి సినిమానే తనని ఈ రోజు కెమెరా ముందు నిలబెట్టిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించడం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. "నేను కాలేజీలో చదువుతున్నప్పుడే అనుకోకుండా కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి నాకొక అవకాశం వచ్చింది. ఎవరో కొంతమంది నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పడంతగా అవగాహన లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు నాకు రూ.5 లక్షల పారితోషికం ఇస్తామన్నారు. వాటితో కారు కొనుక్కోవాలి.. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ సినిమా చేయడానికి అంగీకరించాను.

40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. అప్పుడే గ్రహించా కెమెరా ముందు ఉండడం నాకు ఎంతగానో ఇష్టమని. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తర్వాత నటనలోకి రావాలని నిర్ణయించుకున్నా. అందుకే కొంత విరామం తీసుకుని 2013లో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. ఎవరి ప్రమేయం లేకుండానే ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. ప్రారంభంలో చదువు కారణంగా కొన్ని పెద్ద సినిమాల్ని వదులుకోవల్సి వచ్చింది"అని అంది రకుల్. 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో వెండితెరకు పరిచయమైన ఆమె తిరిగి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'(2013)తో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఇప్పుడామె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న హిందీ చిత్రం 'రామాయణ'లో శూర్పణఖగా కనిపించనుంది.




This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.